## రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉగాది శుభాకాంక్షలు



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రేపటి నుంచి శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ముఖ్యమంత్రి అభిలషించారు. గత సంవత్సరం ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించామని సీఎం గుర్తు చేశారు. ఈ ఏడాదిలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పేలా అందరూ ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం అన్నారు.

## రాష్ట్ర ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు

### -మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



**విశ్వంభర, సూర్యాపేట :** ఉగాది తెలుగు సంవత్సరారంభాన్ని సూచించే ముఖ్యమైన పండుగ అని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇది కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో ముందుకు సాగాల్సిన సమయమని తెలిపారు. ఈ సందర్భంగా రైతాంగానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ సంవత్సరం సమృద్ధిగా పంటలు పండాలని, రైతులు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని తెలిపారు.రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, అన్ని వర్గాల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

## మోతియా మసీదులో ఇఫ్తార్ విందు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** సరూర్ నగర్ డివిజన్ వీఎం హోమ్ లోగల "మోతియా మసీదు"లో రంజాన్ పండుగ సందర్భంగా మసీద్ కమిటీ సభ్యులు కాజా, నవీద్, జాంగిర్, కుల్సన్, సాజిత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇస్తార్ విందు కు సరూర్నగర్ డివిజన్ కాలనీ సంక్షేమ సంఘాల జె ఏ సి అధ్యక్షులు బేర బాలకిషన్, సరూర్నగర్ దివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోయిని మహేందర్ యాదవ్, శంకర్, ధనరాజ్ గౌడ్, చెనరెడ్డి సురేష్ రెడ్డి, ఇమ్రాన్ లు హాజరై రంజాన్ ప్రార్థనలో పాల్గొని ముస్లిం మైనార్టీ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరూర్నగర్ లో అనాదిగా అందరం కలిసిమెలిసి సోదర భావంతో రంజాన్ పండుగ తో పాటు ఉగాది పండుగ కూడా ఘనంగా జరుపుకోవాలని సరూర్ నగర్ పట్టణంలో అందరం ఐకమత్యంగా ఉండాలని అని అన్నారు.. మైనార్టీ సోదరులకు ఏ ఆపద వచ్చినా అందరం ఐక్యంగా ఉంటామని తెలిపారు.

## నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజలకు పరాభావ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు అని ఎల్బీ నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఆలేటి రంగేశ్వరి నాయుడు తెలిపారు.ఈ పరాభావ నామ సంవత్సరంలో మీ కుటుంబానికి ఆనందం,ఆరోగ్యం,ఐశ్వర్యం శాంతి కలగాలని కోరుకుంటున్నాను అని ,కొత్త సంవత్సరంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

## మహనీయుల జయంతి ఉత్సవాలను నిర్వహించాలి

### శంషాబాద్ జోనల్ కార్యాలయంలో వినతి



**విశ్వంభర, మీర్‌పేట్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే, భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ ల జయంతి ఉత్సవాలను బడంగ్పేట్ సర్కిల్ బాలాపూర్ చౌరస్తాలో గల మహనీయుల జయంతి కార్యక్రమాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని కోరుతూ శంషాబాద్ జోనల్ కార్యాలయంలోబిఆర్ఎస్ పార్టీ నాయకులు జటావత్ శీను నాయక్,దిండు భూపేష్ గౌడ్ ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రం ను అందజేశారు. వారు మాట్లాడుతూ.. మహనీయుల విగ్రహాల వద్ద ఫ్లోరింగ్ పైన ఉన్నటువంటి బండలు చుట్టూ ఉన్న రైలింగ్ పూర్తిగా ధ్వంసం అయ్యాయి అని తెలిపారు. పనులు త్వరగా పూర్తిచేసి మహనీయుల జయంతి కార్యక్రమంలో భాగంగా పూలతో అలంకరణలు జన సమీకరణకు తగ్గట్టుగా స్టేజి. సౌండ్ సిస్టం. లైట్స్. ఏర్పాటుచేసి ఘనంగా నిర్వహించాలని కోరడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో నాయకులు జిల్లా సౌందర్య విజయ్, ఫణిందర్ ,మోహన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## స్లోవేనియా పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం

**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో తెలంగాణ పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన రాష్ట్రమని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శాసనసభ కమిటీ హాలులో స్లోవేనియా ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.లైఫ్ సైన్సెస్, ఆటోమొబైల్, ఐటి రంగాల్లో తెలంగాణ విస్తృత అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. యూరోపియన్ యూనియన్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల ఎగుమతులకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో తెలంగాణ దేశంలో ముందంజలో ఉందని, స్లోవేనియా సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టితే ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ఐటి, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో కూడా విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు. సమావేశంలో నవీన్ మిత్తల్, నిఖిల్ చక్రవర్తి, ఆసిఫ్ ఇక్బాల్, సుజిత్ నాయర్, కీర్తి చిలుకూరి తదితరులు పాల్గొన్నారు.



# రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

**○ కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




**విశ్వంభర, సూర్యాపేట:** షెడ్యూల్ కులాల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక అండదండలు అందిస్తోందని, షెడ్యూల్ కులాల నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కల్పనకు 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీలపై అందించే ఆర్థిక సాయాన్ని పొంది ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ చెప్పారు. షెడ్యూల్ కులాల కోఆపరేటివ్ డెవలప్మెంట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ, ట్రాన్స్పోర్ట్, విద్యుత్, బ్యాంకర్స్ తో కలెక్టర్ వెబ్ ఎక్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ, స్వయం ఉపాధి కల్పనకు 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీలపై నిరుద్యోగ యువతీ, యువకులకు ఎలక్ట్రానిక్ వాహనాలు, వ్యవసాయ పరికరాలు అందజేసేందుకు కార్యాచరణ ను ప్రకటించిందన్నారు. జిల్లాలోని ఎస్సీ యువతీ యువకులు స్వయం ఉపాధి పథకములకే దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లుగా తెలిపారు. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ 2025 - 26 కార్యాచరణ పథకంలో భాగంగా ట్రాన్స్ పోర్ట్ రంగం కోసం 193 ఈవి ద్విచక్ర వాహనాలు కేటాయించిందని, ఈవీ టూవీలర్ యూనిట్ విలువ రూ.లక్ష కాగా, అందులో 90శాతం రాయితీ ఉంటుందని, 10 శాతం బ్యాంకు లోన్ ఉంటుందని తెలిపారు. అలాగే అదే విధంగా 95 త్రీవీలర్ యూనిట్ విలువ రూ.3లక్షలు కాగా, 80శాతం రాయితీ, సోలార్ యూనివర్సల్ కంట్రోల్ యూనిట్ విలువ రూ.3లక్షల నుంచి రూ.7లక్షలు కాగా, ఒక్కోదానికి 60శాతం రాయితీగా, 40 శాతం బ్యాంక్ లోన్ ఇవ్వనుందన్నారు. ఆటోలతో పాటు వ్యవసాయ రంగంలో వినియోగించే సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లు 20 మంజూరు చేయబడినవని, యూనిట్ ధర రూ. 3 లక్షల నుంచి రూ.ఏడు లక్షల వరకు ఉండగా 60 శాతం సబ్సిడీ మరియు 40శాతం బ్యాంకు లోన్ ఉంటుందని అన్నారు. వీటికి ఈనెల 24వ తేదీలోగా అర్హులైన షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతీ, యువకులు https://tgobmms.cgg.gov.in// వెబ్సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రాయితీ పథకాలను రానున్న ఐదేళ్లలో కుటుంబంలో ఒక్కరికి మాత్రమే మంజూరు చేస్తారని, స్వయం ఉపాధి పథకాన్ని మొదటి సారి వినియోగించుకుంటున్న కుటుంబంలోని వ్యక్తులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు. నైపుణ్యం, అనుభవం ఉన్న దరఖాస్తుదారులకు తొలి ప్రాధాన్యం ఇస్తామనీ, జిల్లాకు కేటాయించిన ఈ యూనిట్లలో దివ్యాంగులకు 5శాతం, మహిళలకు 33.3శాతం ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈవీ వాహనాలు, సోలార్ కంట్రోల్ యూనిట్లు రాయితీపై పొందేందుకు తప్పనిసరిగా తెల్లరేషన్‌కార్డు ఉండాలని, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలలోపు వార్షిక ఆదాయం ఉండాలని, రవాణా పథకాలకు 21 నుంచి 50 సంవత్సరాల వయసు, వ్యవసాయ ఆధారిత యూనిట్లకు 21 నుండి 60 సంవత్సరాల మధ్య వయసు ఉండాలని, రవాణా యూనిట్లకు శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, రెండెకరాల వ్యవసాయ భూమి, బోరు బావి ఉన్నట్టు పంచాయతీ కార్యదర్శి తో ధ్రువీకరణ అందజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదుచేసిన దరఖాస్తులను ఆర్జీదారుడు డౌన్‌లోడ్ చేసుకుని, సంబంధిత ధ్రువపత్రాలను జత చేసి ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం రూమ్ నెంబర్ ఎఫ్3 ఫస్ట్ ఫ్లోర్ కలెక్టర్ కార్యాలయంలో అందించాలన్నారు. ఈవీ ద్విచక్ర వాహనాల యూనిట్లను ఊబర్, రాపిడో, జొమాటో, స్విగ్గీ వంటి సేవలు అందిస్తున్న వారికి ప్రాధాన్యం ఉంటుందని, లబ్ధిదారులను జిల్లా స్థాయి కమిటీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ తెలిపారు. అనంతరం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, కార్య నిర్వాహక సంచాలకులు దయామణి, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి జయప్రకాశ్ రెడ్డి ఎల్ డి ఎం ఎంవి ఎన్ ప్రసాద్, ఎలక్ట్రికల్ ఏ డి అశోక్ వ్యవసాయ శాఖ నుండి ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

# వరద నియంత్రణపై దృష్టి

**- హైడ్రా కమిషనర్ రంగనాథ్**



**విశ్వంభర, హైదరాబాదు :** వరదలు ముంచెత్తని నగరమే లక్ష్యంగా హైడ్రా పని చేస్తోందని, ముందస్తు జాగ్రత్తలతోనే సమస్యలను తగ్గించగలం అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్, కృష్ణా-గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవడంతో గత ఏడాది భారీ వర్షాలు పడినా పెద్దగా ఇబ్బందులు తలెత్తలేదని చెప్పారు. చెరువులు, వరద కాలువల పునరుద్ధరణను పెద్ద ఎత్తున చేపట్టామని, 24 చెరువుల్లో 3 ఇప్పటికే పూర్తిచేశామని వివరించారు. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో సహజ వనరులు తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. 1975తో పోలిస్తే నగర జనాభా గణనీయంగా పెరిగిందని, చెరువుల సంఖ్య 61 శాతం తగ్గిందని వెల్లడించారు. నగరంలో వేలాది నాలాలు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించామని, వాటిని తొలగిస్తూ పునరుద్ధరణ చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు. బతుకమ్మకుంట, ప్యాట్నీ నాలా వంటి ప్రాజెక్టులతో వరద ముప్పును తగ్గించగలిగామని చెప్పారు. జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ తదితర శాఖల చట్టాలు హైడ్రాకు అప్పగించడంతో ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం కలిగిందన్నారు. పర్యావరణహిత నగర నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సెంట్రల్ వాటర్ కమిషన్, కృష్ణా, గోదావరి బేసిన్ సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 29న యుద్ధం ఆపాలని ర్యాలీ



**విశ్వంభర, హిమాయత్ నగర్ :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. హైదరాబాదు హిమాయత్ నగర్ లోని మగ్దూం భవన్‌లో ప్రొఫెసర్ కోదండరాం అధ్యక్షతన యుద్ధ వ్యతిరేక కమిటీ ఏర్పాటైంది. పశ్చిమాసియా, మధ్య ప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధంతో భారీ ప్రాణనష్టం, ఆస్తుల విధ్వంసం జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావంతో భారతదేశంలో ఆయిల్ సంక్షోభం ఏర్పడి వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ మార్చి 29న చార్మినార్ నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో కే. నారాయణ, ఈటి నరసింహ, డి.జీ. నర్సింహరావు, చలపతిరావు, కే. గోవర్ధన్, కే. రమా, హన్వేష్, పి.ఎల్.వి., విజయ్, నిజాం, అజీజ్ పాషా, షహబాజ్, హుస్సేన్, సారా మాథ్యూస్, లుబ్నా సర్వత్, ఎస్.ఏ. రాహుఫ్, జావిద్ షరీఫ్, రవిచందర్, రజా హుస్సేన్, ప్రబోద సుమేరు, మునీర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.


# ట్రాన్స్‌జెండర్ బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళన




**విశ్వంభర, హైదరాబాద్ :** మా అస్తిత్వాన్ని చెరిపేసే ట్రాన్స్‌జెండర్ సవరణ బిల్లు 2026ను ఉపసంహరించాలని అడ్వొకేట్ జి. కిరణ్ రాజ్ డిమాండ్ చేశారు. హైదరాబాదులోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద బుధవారం సాయంత్రం ట్రాన్స్‌మెన్ తరఫున వందలాది మంది ట్రాన్స్‌జెండర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, బిల్లు ట్రాన్స్‌మెన్‌ను చట్టపరమైన నిర్వచనం నుండి తొలగించే ప్రమాదం ఉందన్నారు. దీంతో గుర్తింపు కోల్పోయే పరిస్థితి తలెత్తుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టపరమైన రక్షణ లేకపోవడంతో కుటుంబాల్లో బలవంతపు వివాహాలు, హింస పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. 2014లో సుప్రీంకోర్టు ఇచ్చిన స్వీయ గుర్తింపు హక్కులకు విరుద్ధంగా ఈ బిల్లు ఉందని తెలిపారు. ట్రాన్స్‌మెన్, ట్రాన్స్‌జెండర్ సమాజాల మధ్య విభేదాలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే సాధించిన హక్కులను వెనక్కి నెట్టే తిరోగమన చర్యగా ఈ బిల్లును అభివర్ణించారు.బిల్లుపై ప్రభుత్వం పునరాలోచించి బాధితులతో చర్చలు జరిపిన తర్వాతే ముందడుగు వేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రాన్స్‌మెన్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కటకం నర్సింగరావు కలిసిన గాయకుడు ఏపూరి సోమన్న

### జన జాగరణ జాతర విజయవంతానికి మద్దతు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మన ఆలోచన సాధన సమితి (మాస్)వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగరావు నివాసంలో తెలంగాణ ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 19న నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో నిర్వహించే జన జాగరణ జాతర కార్యక్రమానికి తన పూర్తి మద్దతు ఇస్తున్నట్లు సోమన్న ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తన పాత్ర ప్రముఖంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చనబోయిన శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి గుణగంటి చంద్రశేఖర్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెదవుర బ్రహ్మయ్య, దువ్వాల శ్రీకాంత్, సోషల్ మీడియా కార్యదర్శి కైరంకొండ నర్సింగ్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ బంగారుగడ్డ దశరథ, దూదిగాని వీరన్న తదితరులు పాల్గొన్నారు.




## రంజాన్ కానుకలు పంపిణీ

**విశ్వంభర, మలక్ పేట్ :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ బాలుర ప్రాథమిక అందుల పాఠశాల ఆయా లకు , ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కాలాడే రా ఆయాలకు రంజాన్ కానుకను అందజేసిన బహుదూర్పుర డిప్యూటీ ఐఓఎస్ వెంకట్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతబస్తీలోని దారుల్ షిఫా లో అందుల కొరకు ప్రత్యేకంగా ఉన్న పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని హాస్టల్ సౌకర్యము, పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ బ్రెయిలీ లిపి కొరకు ఆధునిక సాధనాలు ఉన్నాయని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన చదువు అందుతుందని విద్యార్థులందరూ ఈ అవకాశాలను ఉపయోగించుకొని భవిష్యత్తులో అభివృద్ధిలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు అంజద్ ఖాన్, రవికాంత్, రవీందర్ రెడ్డి, జానయ్య, మలిహ పాల్గొన్నారు.

## ఇన్స్పెక్టర్ శ్రీశైలం యాదవ్‌కు శుభాకాంక్షలు




**విశ్వంభర, ఎల్బీనగర్ :** సరూర్ నగర్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం యాదవ్ నూతనంగా బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా గడ్డి అన్నారం డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ యం .సునిల్ బాబు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి మహాశివుని ప్రతిమను బహుకరించి , ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ , కృష్ణారెడ్డి, విజయ్, మహేష్ , డింపు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ రవిచంద్ర సహాయంతో సొంతగడ్డకు చేరిన శ్వేత పార్థివదేహం



**విశ్వంభర, ఇనుగుర్తి :** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సహకారంతో గుండెపోటుతో అమెరికాలో కన్నుమూసిన శ్వేత పార్థివ దేహం సొంత గడ్డ హనుమకొండకు చేరింది. వివరాల్లోకి వెళితే హన్మకొండ వికాస్ నగర్ నివాసి, ఏన్ఐటీ రిటైర్డ్ ప్రొ.కే.లక్మారెడ్డివెంకటలక్ష్మీ దంపతుల కుమార్తె శ్వేత ఇటీవల అమెరికాలో అకాల మరణం చెందారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఆమె ఆ తర్వాత భర్త సురేష్‌రెడ్డి,ఇద్దరు పిల్లలతో కలిసి కాలిఫోర్నియాలో నివసిస్తున్నారు.భార్యాభర్తలందరు కూడా సాఫ్ట్వేర్ ఉద్యోగులు, శ్వేత గుండెపోటుకు గురై ఈనెల 8వతేదీన అకాల మృత్యువునకు లోనయ్యారు. ఆమె పార్థివదేహాన్ని సొంతగడ్డకు రప్పించేందుకు గాను వారి సమీప బంధువు కృష్ణారెడ్డి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సహాయాన్ని కోరారు.ఆ సమయాన పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఎంపీ రవిచంద్ర వెంటనే స్పందించి విషయాన్ని హోం మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు.మంత్రి అమెరికాలోని భారత రాయబారి కార్యాలయ అధికారులను ఆదేశించడంతో శ్వేత మృతదేహం హన్మకొండ ఎన్జీవో కాలనీ రోడ్డులో ఉన్న నివాసానికి చేరింది,ఆమె అంతిమ సంస్కారం పద్మాక్షిగుట్ట సమీపాన ఉన్న శ్మశాన వాటికలో బుధవారం మధ్యాహ్నం జరిగింది.

### సమస్యలు పరిష్కరించాలని సర్కిల్ కార్యాలయం వద్ద

## బిజెపి నేతల ఆందోళన



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ప్రజా సమస్యల పరిష్కరించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు నిరసన చేశారు. బుధవారం సరూర్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ కు మాజీ కార్పొరేటర్ నరసింహగుప్తా, రంగారెడ్డి జిల్లా బిజెపి కౌన్సిల్ సభ్యుడు బత్తుల సుమన్ గౌడ్, జిల్లా నాయకుడు రుద్రారం శంకర్, బిజెపి ఎస్సీ మోర్చా కోకన్వీనర్ కృష్ణప్రకాష్ తదితర నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు చైతన్యపురి డివిజన్ బిజెపి డివిజన్ సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన బాధితులకు తక్షణమే సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. డివిజన్ పరిధిలో పేరుకుపోయిన దోమలు, రోడ్లు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, మంచినీరు తదితర సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి నాయకులు పర్ల శివ, నవీన్ యాదవ్, రమణ వేణు చారి అంజిబాబు, శ్రీదేవి, నాయకులు, కార్యకర్తలు, బాధితులు పాల్గొన్నారు.